సమాచారం లేని చట్టం

- సమాచార హక్కు చట్టంపై అధికారుల అలసత్వం
- బోర్డులు కూడా ఏర్పాటు చేయని వైనం
- ప్రజల్లో కొరవడిన అవగాహన
- పాలకుల తీరుతో నిర్వీర్యం అవుతున్న చట్టం

కర్నూలు (రూరల్): ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థల నుంచి సమాచారాన్ని అడిగి తీసుకునే అధికారమే సమాచార హక్కు చట్టం. సామాన్యుడు ఏ ఆఫీసుకు వెళ్లినా పని చేయించుకోవడం, తనకు కావాల్సిన సమాచారాన్ని రాబట్టడం కష్టతరమైన నేపథ్యంలో భారత ప్రభుత్వం 2005లో ఈ చట్టాన్ని అమలులోకి తెచ్చింది. దీని ద్వారా ప్రభుత్వ పనులపై సమాచారం పొందవచ్చు. ప్రభుత్వ పాలనలో జరుగుతున్న మంచిచెడుల సమాచారంపై ప్రతి పౌరుడు అవగాహన పెంచుకునేందుకు ప్రజలకు అందుబాటులో ఉన్న పశుపతాస్త్రం సమాచార హక్కుచట్టం. అయితే కొంతమంది అధికారులు తమ బాగోతాలు బట్టబయలు కాకుండా ఉండేందుకు ఈ చట్టాన్ని తుంగలో తొక్కుతున్నారు.




కర్నూలు మండల విద్యుత్ ఏఈ కార్యాలయంలో కానరాని స.హ చట్టం బోర్డు   కర్నూలు స్త్రీ శక్తి భవనంలో..

ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించాల్సిన అధికారులే దీనిపై చిన్నచూపు చూస్తున్నారు. ఇలాంటి అధికారుల అలసత్వం కారణంగా సమాచార హక్కు చట్టంపై నేటి యువతలో అవగాహన కొరవడింది. ప్రభుత్వ కార్యాలయాలతో పాటు ఇతర అభివృద్ధి కార్యక్రమాల్లో అవినీతి, అక్రమాల నియంత్రణకే కాక ప్రభుత్వ అవకతవకలను ఈ చట్టంతో నియంత్రించవచ్చు. కానీ ఆయా కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టం ప్రాధాన్యతను వివరిస్తూ బోర్డులు ఏర్పాటు చేయల్సి ఉండగా పలు ప్రభుత్వ కార్యాలయాల్లో ఆయా బోర్డులు మచ్చుకైనా కానరావడం లేదు. కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ఈ బోర్డుల్లో ఆయా కార్యాలయం అప్పిలేట్ అధికారి పేరు, ఫోన్ నంబర్‌తో సహా వివరాలను తెలియజేయాల్సి ఉండగా ఆయా శాఖల అధికారులు అవేమీ పట్టించుకోకపోవడం గమనార్హం.

అన్నీ పాత పేర్లే

కొన్ని కార్యాలయాల్లో ఈ చట్టం అమల్లోకి వచ్చినప్పుడు ఏర్పాటు చేసిన బోర్డులే తప్ప, సదరు కార్యాలయ అధికారి బదిలీ జరిగినప్పుడు ఆ స్థానంలో కొత్తగా వచ్చిన వారి పేరు, ఇతర వివరాలను మార్పు చేయకుండా అలాగే వదిలివేయడం గమనార్హం. దీంతో సమాచార హక్కు చట్టం ఒకటి ఉందనే విషయాన్ని ప్రజలు మరిచిపోతున్నారు. సమాచార హక్కు చట్టంపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తే తాము చేసిన లొసుగులు బట్ట బయలు అవుతాయనే అలజడి కొందరు అవినీతి అధికారుల్లో ఉంది. మరోవైపు ఎక్కడ పనిభారం పెరుగుతుందోననే ఉద్దేశంతో పలువురు అధికారులు ఈ చట్టానికి తూట్లు పొడుస్తున్నారు. సమాచార హక్కు చట్టం కింద ఆయా సమాచారం కోరుతూ దరఖాస్తు చేసుకున్న వారికి శాఖల వారీగా నిర్ణీత కాలంలో అడిగిన పూర్తిస్థాయి సమాచారాన్ని ఇవాల్సి ఉంటుంది. ఈ పరిణామాలన్నీ అధికారులకు ఇబ్బంది కలిగిస్తాయని, అందుకే ఈ చట్టంపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడం లేదనే విమర్శలు వస్తున్నాయి. అయితే కొంతమంది అవినీతి అధికారులు మాత్రం దీనిని ప్రజల్లోకి వెళ్లనీయకుండా మోకాలడ్డుతున్నారనే చెప్పాలి. కర్నూలు నగరంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో ముఖ్యంగా కల్లూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, కర్నూలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం బోర్డులు కొన్ని చోట్ల ఏర్పాటు చేశారు. అధికారులు బదిలీ అయినప్పుడు కొత్తగా పదవీ బాధ్యతలు తీసుకున్న అధికారుల పేర్లు సమాచార హక్కు చట్టం బోర్డులో రాయడం లేదు. అలాగే నగరంలో ఉన్న విద్యుత్ శాఖ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం బోర్డులు ఎక్కడ ఏర్పాటు చేశారో అని కార్యాలయానికి వచ్చిన ప్రజలు వెదుకుతున్నా కనిపించడం లేదు. కర్నూలు మండల పరిధి విద్యుత్ శాఖ కార్యాలయం, కర్నూలు మండల సూర్యోదయం మండల మహిళ సమాఖ్య కార్యాలయంలో సమాచార హక్కు చట్టం బోర్డులు కార్యాలయానికి వచ్చిన ప్రజలు వెదికినా కనిపించటం లేదు. అలాగే గ్రామాల్లో ఉన్న పశు వైద్యశాలలు, నందనపల్లె సచివాలయం, జిల్లా పరిషత్ హైస్కూల్ సహా కొన్ని గ్రామాల్లో ఉన్న సచివాలయాలు, పశు వైద్యాశాలల్లో ఏర్పాటు చేయలేదు. సమాచార హక్కు చట్టం అమలు తీరుపై అధికారులు వ్యవహరిస్తున్న నిర్లక్ష్యపు వైఖరిపై పలు విమర్శలు వెల్లువెత్తున్నాయి.



కర్నూలు ఆర్టీఓ కార్యాలయంలో కనిపించని విధంగా ఏర్పాటు చేసిన బోర్డు

అవగాహన అవసరం



సమాచార హక్కు చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించి చైతన్యపరచడం చాలా అవసరం. కేవలం అవినీతి అధికారులు కోసమే ఈ చట్టం కాదు. సామాన్యుని చేతిలో అస్త్రం వంటి ఈ చట్టంతో భారీ కుంభకోణాలను వెలుగు చూసిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ప్రభుత్వ పథకాల్లో అవకతవకలను ఈ చట్టంతో వెలికి తీయవచ్చు.

–ఎస్.కె.జయన్న, రాష్ట్ర కార్యదర్శి, సమాచార హక్కు పరిరక్షణ వేదిక

అవినీతి బయటపడుతుందనే..



ప్రభుత్వ కార్యాలయాల్లో కొందరు అవినీతి అధికారులు తాము చేసే అవినీతి బయట పడకుండా ఉండేందుకే సమాచార హక్కు చట్టం గురించి సమాచార బోర్డులను ఏర్పాటు చేయడం లేదు. ప్రభుత్వ కార్యాలయాలతో పాటు ఇతర అభివృద్ధి కార్యక్రమాల్లో అవినీతి, అక్రమాల నియంత్రణకు ఈ చట్టం ఉపయోగపడుతుంది.

–ఎం.రాజ్‌కుమార్, సామాజిక కార్యకర్త, భూపాల్ నగర్

సమాచారం ఇవ్వడం లేదు



గార్గేయపురం గ్రామ పొలిమేరలోని సర్వే నంబర్ 751లో ఉన్న రైతుల వివరాలతో పాటు 1947 నుంచి 2024 సంవత్సరం వరకు ఆ సర్వే నంబర్‌లో జరిగిన మార్పులు, చేర్పులు వివరాలు తెలపాలని కర్నూలు జిల్లా కలెక్టర్ కార్యాలయానికి సమాచార హక్కు చట్టం ద్వారా 2024 నవంబర్ 25న రిజిస్టర్ పోస్టు చేశాను. ఇంతవరకు అధికారులు ఎలాంటి సమాచారం తెలపలేదు.

–మునిపాటి బాలచెన్ను, గార్గేయపురం గ్రామం

క్లుప్తంగా

నూతన వధూవరులకు ఆశీర్వాదం



వివాహ వేడుకలో కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, సతీష్

సి.బెళగల్: మండల పరిధిలోని పోలకల్ గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్రీనివాసులు కుమారుడి వివాహానికి కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సతీష్ హాజరయ్యారు. శనివారం పోలకల్ చెన్న సోమేశ్వరస్వామి సన్నిధిలో జరిగిన వేడుకలో వధూవరులను ఆశీర్వదించారు. వారి వెంట ఎంపీపీ బొంతల మునెప్ప, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు నరసింహుడు, అధికార ప్రతినిధి ప్రభాకర్‌రెడ్డి, బూత్ కమిటీ అధ్యక్షుడు లక్ష్మీకాంతరెడ్డి, మండల అధ్యక్షుడు సోమశేఖర్‌రెడ్డి,నాయకులు పులిరాజు, బాలరాజు ఉన్నారు.

నడిరోడ్డుపై ఊడిపడిన స్టెప్నీ టైర్



రోడ్డుపై పడిన టైరు

పాణ్యం: మండల పరిధిలోని తమ్మరాజుపల్లె గ్రామం వద్ద ఓ ట్యాంకర్ స్టెప్నీ టైర్ ఊడిపోయింది. దీంతో ట్రాఫిక్ జామ్ అయ్యింది. శనివారం నంద్యాల నుంచి కర్నూలు వైపు వెళ్తున్న ఓ ట్యాంకర్‌కు చెందిన స్టెప్నీ టైర్ ఊడిపోయింది. ట్యాంకర్ వెనుక వస్తున్న లారీ టైర్‌ను ఢీకొని ఆగింది. దీంతో లారీ, ట్యాంకర్ డ్రైవర్ల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో కాసేపు ట్రాఫిక్ జామ్ అయ్యింది. సమాచారం అందుతున్న హైవే పోలీసులు సంఘటనా స్థానికి చేరుకుని వారికి సర్దిచెప్పి ట్రాఫిక్ క్లియర్ చేశారు.

అర్జీల స్వీకరణ



ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే చరితారెడ్డి

కల్లూరు: ప్రజల నుంచి వచ్చే అర్జీలను పరిశీలించి పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటామని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. పాణ్యం నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఎమ్మెల్యే వినతి పత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వినతులను అధికారులు విచారించి ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గౌరు వెంకటరెడ్డి, పెరుగు పురుషోత్తం రెడ్డి, ప్రభాకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బోరుకు మోటార్ ఏర్పాటు చేయరూ..



శ్మశాన వాటికలో వేసిన బోరును చూపుతున్న సీపీఎం నాయకులు

కోడుమూరు రూరల్: ప్యాలకుర్తి గ్రామంలోని శ్మశాన వాటికలో వేసిన బోరుకు మోటార్ ఏర్పాటు చేయాలని సీపీఎం మండల నాయకుడు గపూర్‌మియ్యా కోరారు. శనివారం ప్యాలకుర్తి శ్మశాన వాటికలో వేసిన బోరును సీపీఎం నాయకులు పరిశీలించారు. బోరు వేసి నెలలు గడుస్తున్నా మోటారు ఏర్పాటు చేసి కనెక్షన్ ఇవ్వకపోవడంతో నిరూపయోగంగా మారిందని, అంత్యక్రియలకు వచ్చే ప్రజలు నీళ్లలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి బోరుకు మోటార్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. సీపీఎం నాయకులు వీరన్న, ఎర్రమద్దిలేటి పాల్గొన్నారు.

ఉపయోగం లేని గిరిజన భవన్

కర్నూలు(రూరల్): జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలోని గిరిజన్ భవన్‌తో గిరిజనులకు ఎలాంటి ఉపయోగం లేదని లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ కైలాస్ నాయక్ అన్నారు. కర్నూలు నగర సమీపంలోని దిన్నెదేవరపాడులో ఉన్న గిరిజన్ భవన్‌ను గత ప్రభుత్వం రూ.1.35 కోట్లతో నిర్మించిందని తెలిపారు. గిరిజనుల పెళ్లిళ్లు, శుభకార్యాలు నిర్వహించుకోవడానికి భవనం ఏర్పాటు చేశారన్నారు. అయితే ఈ భవనంలో ఇంతవరకు గిరిజనులు శుభకార్యాలు నిర్వహించలేదని చెప్పారు. కనీసం భవనానికి చేరుకోవడానికి సరైన రోడ్డు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు పట్టించుకోవడం లేదని తెలిపారు. కుర్చీలు, టేబుళ్లు, వంట సామగ్రి, నీటి సౌకర్యం లేనందున గిరిజనులు ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించడం లేదన్నారు. అధికారులు స్పందించి సౌకర్యాలు కల్పించాలని కోరారు.

సమాజంలో మహిళల పాత్ర కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న సత్యవాణి

ఓర్వకల్లు: నవ సమాజంలో మహిళలు కీలకపాత్ర పోషిస్తున్నారని భారతీయం సత్యవాణి అన్నారు. శనివారం ఓర్వకల్లు మండలం కాల్వబుగ్గలో స్థాపించిన సురభి గోశాల భారతీయ స్ఫూర్తి కేంద్రంలో నారీ శక్తి చైతన్య సమ్మేళనం అనే అంశంపై ధార్మిక సమావేశం నిర్వహించారు. చంద్రమౌళిని అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి సత్యవాణి ముఖ్య అతిథిగా మాట్లాడారు. సమాజంలో మహిళలు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలనే ఉద్దేశంలో వికాస భారతి మహిళా శక్తి సమ్మేళన కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. మహిళ తన కర్తవ్యాన్ని తాను సక్రమంగా నిర్వరిస్తే దేశంలో వృద్ధాశ్రమాలు ఉండవని పేర్కొన్నారు. కుటుంబంలో మహిళ తన బాధ్యతను బాగా నిర్వర్తిస్తే కుటుంబ వ్యవస్థ బాగుపడుతుందని అభిప్రాయపడ్డారు. యువత మత్తు పదార్థాలకు బానిసకాకుండా, తప్పుదోవ పట్టకుండా ఉండాలంటే కుటుంబంలోని మహిళ తన బాధ్యతలను నిర్వర్తించాలని తెలిపారు. సమావేశంలో భారతీయ స్ఫూర్తి కేంద్రం అధ్యక్షులు హుస్సేన్‌రెడ్డి, నాగేంద్ర ప్రసాద్, గోశాల ప్రధాన కార్యదర్శి పోచా మహేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

10 మంది విద్యార్థినులకు అస్వస్థత

- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన వైనం

గడివేముల: మండల కేంద్రమైన గడివేములలోని ఏపీ మోడల్ స్కూల్ హాస్టల్‌లో ఈ నెల 2వ తేదీ (ఆదివారం) చికెన్ తిని 10 మంది విద్యార్థినులు ఆస్వస్థతకు గురైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మోడల్ స్కూల్ హాస్టల్‌లో ఉండే విద్యార్థినులకు ఆదివారం మెనూలో చికెన్ ఉండడంతో నాణ్యత లేని చికెన్ తీసుకొచ్చారు. వండే సమయంలో ఉడకకపోవడంతో తిన్న 10 మంది విద్యార్థినులకు వాంతులు, కడుపునొప్పితో తీవ్ర ఆస్వస్థతకు గురయ్యారు. మరుసటి ఉదయం అధికం కావడంతో వార్డెన్ బయటకి తెలియకుండా స్థానిక ఆర్‌ఎంపీల వద్ద చికిత్స చేయించింది. ఎంతకు తగ్గక పోవడంతో విద్యార్థినుల తల్లిదండ్రులకు సమాచారం అందించడంతో నంద్యాలలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నట్లు తెలిసింది. ఇప్పటికీ ఇద్దరు విద్యార్థినులు ఆసుపత్రిలో ఉన్నట్లు సమాచారం. దీంతో హాస్టల్ నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థినులు చాలా మంది ఇంటికి వెళ్లిపోయారు. ఉన్నతాధికారులు విచారణ చేసి పాఠశాల ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని విద్యార్థుల సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

చేనేత రంగంపై కేంద్రం చిన్నచూపు



మాట్లాడుతున్న చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మాధవస్వామి

కోడుమూరు రూరల్: చేనేత రంగానికి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో కేవలం రూ.200 కోట్లు కేటాయించడం దారుణమని.. చేనేతలపై కేంద్రం చిన్న చూపు చూస్తోందని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మాధవస్వామి విమర్శించారు. శనివారం కోడుమూరులో చేనేత కార్మికుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవస్వామి మాట్లాడుతూ.. దేశంలో కోట్లాది మంది నమ్ముకుని జీవనం సాగిస్తున్న చేనేత రంగానికి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో కేవలం రూ.200 కోట్లు కేటాయించడమేమిటని ప్రశ్నించారు. వ్యవసాయం తర్వాత అతిపెద్దదైన చేనేత రంగాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్రం యతిస్తోందని ఆరోపించారు. ఇకనైనా బడ్జెట్‌లో చేనేత రంగానికి ఎక్కువ నిధులు కేటాయించాలని, లేకపోతే చేనేత కార్మికులతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో స్థానిక చేనేత కార్మిక సంఘం నాయకులు మహబూబ్‌బాషా, నరసింహులు, శ్రీరాములు, విజయ్, గిడ్డయ్య, సీపీఐ మండల కార్యదర్శి రాజు, ఏఐటీయూసీ తాలుకా కార్యదర్శి రాముడు తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా వసంతోత్సవం



వసంతప్ప పీఠం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

సి.బెళగల్: మండలంలోని చింతమానుపల్లె గ్రామంలో శనివారం వసంతోత్సవం ఘనంగా జరిగింది. గ్రామ పొలిమేరలో ఉన్న వసంతప్ప ఆలయంలో స్వామివారి పీఠంను సుందరంగా అలంకరించారు. భక్తులు ఫలహార బళ్లతో ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ప్రత్యేక పూజల అనంతరం స్వామివారి ఉత్సవమూర్తులను పీఠం నుంచి తరలించారు. ఏటా పంటల దిగుబడులు ఇళ్లకు చేరిన సందర్భంగా మాఘమాసం దశమిలో వసంతోత్సవం నిర్వహించడం అనవాయితీగా వస్తోందని గ్రామ పెద్దలు తెలిపారు.

ఆదరణ ఏదీ..?



పంచాయతీ కార్యాలయం ఆవరణలో తుప్పపట్టిన పశుగ్రాస కటింగ్ యంత్రాలు

పాణ్యం: గత టీడీపీ ప్రభుత్వ హయాంలో (2014–19) రాయితీపై రైతులకు అందించేందుకు పాణ్యం మండలానికి పశుగ్రాస యంత్రాలు వచ్చాయి. అయితే వాటి పంపిణీ నామమాత్రంగా చేసి మిగిలిన యంత్రాలు అలాగే వదిలేశారు. పాడి రైతులకు రాయితీపై పశుగ్రాస యంత్రాలు అందిస్తున్నట్లు ఆదరణ పథకాన్ని తెచ్చి పబ్లిసిటీ చేసుకున్నారు. కానీ క్షేత్ర స్థాయిలో యంత్రాలను పక్కనపడేశారు. దీంతో కొన్నేళ్లుగా ఈ యంత్రాల విడిభాగాలు తుప్పుపట్టిపోయాయి.

కర్నూలు మెడికల్ కాలేజీ ‘శ్రీమంతులు’

కర్నూలు(రూరల్): కర్నూలు మెడికల్ కాలేజీకి చెందిన 2020–24 బ్యాచ్ విద్యార్థులు దిన్నెదేవరపాడు గ్రామంలోని పలు కుటుంబాలను దత్తత తీసుకున్నారు. కమ్యూనిటీ మెడిసిన్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో శనివారం మొదటి విడతలో 60 మంది విద్యార్థులు 180 గృహాలను దత్తత తీసుకున్నట్లు సర్పంచ్ మాధవ స్వామి తెలిపారు. గ్రామంలోని మొత్తం 750 కుటుంబాలను దత్తత తీసుకుంటామని కమ్యూనిటీ మెడిసిన్ డిపార్ట్‌మెంట్ విద్యార్థులు తెలిపారు. గ్రామాభివృద్ధితో పాటు ఆ కుటుంబాల ఆర్థికాభివృద్ధికి సహకరిస్తామన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

కర్నూలు : కర్నూలు బళ్లారి చౌరస్తాలోని టీవీఎస్ షోరూమ్‌కు ఎదురుగా జరిగిన రోడ్డు ప్రమాదంలో వీకర్ సెక్షన్ కాలనీకి చెందిన బోయ అయ్యన్న (80) మృతిచెందాడు. శనివారం మధ్యాహ్నం నగరంలో నుంచి వీకర్ సెక్షన్ కాలనీకి నడుచుకుంటూ వెళ్తుండగా కల్లూరు వైపు నుంచి కోడుమూరు వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలిసిన వెంటనే ట్రాఫిక్ పోలీసులు అక్కడికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. లారీతో పాటు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీ కేంద్రానికి తరలించారు. మృతుడికి భార్య లక్ష్మీదేవితో పాటు కూతురు ఉంది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, ప్రమాద సంఘటనపై విచారణ జరుపుతున్నట్లు ట్రాఫిక్ సీఐ మన్సురుద్దీన్ తెలిపారు.

ఓపెన్ కిక్ బాక్సింగ్ పోటీల్లో కర్నూలుకు పతకాలు



పతకాలు సాధించిన క్రీడాకారులు

కర్నూలు (టౌన్) : ఈనెల 1 నుంచి 5వ తేదీ వరకు ఢిల్లీ నగరంలో అంతర్జాతీయ వాకో ఇండియా కిక్స్ బాక్సింగ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 4వ ఒపెన్ కిక్ బాక్సింగ్ పోటీల్లో కర్నూలు క్రీడాకారులు పతకాలు సాధించారు. జిల్లాకు చెందిన గుర్రం జయకళ్యాణ్, ఉపేంద్ర, ఈశ్వర్ వెండి, కాంస్య పతకాలు సాధించినట్లు కిక్ బాక్సింగ్ రాష్ట్ర కార్యదర్శి నరేంద్ర ఆచారి శనివారం తెలిపారు.

రుణాలకు నిబంధనలు సడలించాలి

కర్నూలు (అర్బన్) : కూటమి ప్రభుత్వం కాపు, బలిజ కులాల వారికి స్వయం ఉపాధి పథకం ద్వారా అందజేస్తున్న సబ్సిడీ రుణాలకు నిబంధనలు సడలించాలని కర్నూలు నగర బలిజ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మన్న, రవికుమార్ డిమాండ్ చేశారు. పథకం, నమోదు చేసుకోవడానికి చివరి తేదీలు సరిగా ప్రచారం చేయకపోవడం వల్ల చాలా మంది దరఖాస్తు చేసుకోలేకపోయారన్నారు. అలాగే దరఖాస్తు చేసుకోవడానికి కుల ధ్రువీకరణ పత్రం తప్పనిసరి కనుక, ఆ పత్రం పొందడానికి మూడు నాలుగు రోజుల సమయం పడుతుందన్నారు. కాబట్టి ఈ నెల ఆఖరి వరకు దరఖాస్తు చేసుకోవడానికి వీలు కల్పించాలని కోరారు.

కోనా వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు



స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న పూజారి

సి.బెళగల్: మండల పరిధిలోని క్రిష్ణదొడ్డి గ్రామ కొండపై వెలసిన కోనా వేంకటేశ్వర స్వామికి శనివారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. స్వామివారికి ప్రియమైన రోజు కావడంతో భూదేవి, అలివేలిమంగమ్మ సమేత స్వామివారి మూల విగ్రహాలకు అభిషేక పూజలతో పాటు ప్రత్యేక పుష్ప, పత్రాలతో అలంకరించి పూజా కార్యాక్రమాలను చేపట్టారు. స్థానిక గ్రామస్తులతో పాటు, సి.బెళగల్, బురాన్‌దొడ్డి, పుల్లకుర్తి, పోలకల్, ఇనగండ్ల గ్రామాలకు చెందిన భక్తులు కొండపైకి చేరి స్వామి వారికి పూజలను నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు.

ఆ ఇంజినీరింగ్ కళాశాలపై చర్యలు తీసుకోవాలి



ధర్నా చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

కల్లూరు: ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తున్న దూపాడు సమీపంలోని కేవీ సుబ్బారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల గుర్తింపు రద్దు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం కళాశాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు రంగప్ప, పీఎస్‌ఎన్ జిల్లా కన్వీనర్ అమర్, రాయలసీమ యూనివర్సిటీ కన్వీనర్ రామకృష్ణ మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా సెలవు రోజులో కూడా కళాశాలను నిర్వహిస్తున్నారని ఆరోపించారు. విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నారని మండిపడ్డారు. కళాశాలలో మౌలిక వసతులు కల్పించకుండా విద్యార్థుల నుంచి లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారన్నారు. విద్యార్థి సంఘాల నాయకులు మనోహర్, శంకర్, జితేంద్ర, రజాక్ తదితరులు పాల్గొన్నారు.

తప్పిన పెను ప్రమాదం



రోడ్డుపై బోల్తాపడిన లారీ

- ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఆర్టీసీ బస్సును ఢీకొని బోల్తాపడిన లారీ

కోడుమూరు రూరల్: కోడుమూరు–కర్నూలు రోడ్డులో ఆర్టీసీ బస్సును ఓవర్‌టేక్ చేసే క్రమంలో బస్సును వెనుక నుంచి ఢీకొని లారీ బోల్తాపడింది. వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం కర్నూలు నుంచి బళ్లారికి వెళుతున్న ఆర్టీసీ బస్సును కోడుమూరు సమీపంలో పశువుల దాణా లోడ్‌తో వెళుతున్న లారీ డ్రైవర్ అతివేగంగా ఓవర్‌టేక్ చేసేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో బస్సు వెనుక భాగాన్ని ఢీకొట్టి అదుపుతప్పి రోడ్డుపై అడ్డంగా లారీ బోల్తా పడింది. బస్సు డ్రైవర్ చాకచక్యంతో బస్సు వేగాన్ని అదుపు చేయడంతో పాటు, ప్రమాదానికి గురికాకుండా జాగ్రత్తపడడంతో బస్సులోని ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. ప్రమాదానికి లారీ డ్రైవర్ అతివేగమే కారణంగా పోలీసులు నిర్ధారించారు. కాగా దాణా బస్తాలతో రోడ్డుపై అడ్డుగా పడ్డ లారీని ఎస్ఐ శ్రీనివాసులు తన సిబ్బందితో అతికష్టం మీద క్రేన్ సహాయంతో పక్కకు తొలగించి ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగకుండా చేశారు.

పాఠశాలల విలీనం సరికాదు



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర సహఅధ్యక్షుడు సురేష్‌కుమార్

కర్నూలు సిటీ: మోడల్ ప్రైమరీ స్కూళ్ల పేరుతో గ్రామ పంచాయతీల్లోని స్కూళ్లన్నింటినీ ఒకే స్కూల్‌లో విలీనం చేయడం సరైంది కాదని యూటీఎఫ్ రాష్ట్ర సహ అధ్యక్షుడు సురేష్‌కుమార్ అన్నారు. శనివారం ఆ సంఘం కార్యాలయంలో జరిగిన ఆఫీస్ బేరర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ స్కూళ్లను బలోపేతం చేయాల్సింది పోయి మోడల్ ప్రైమరీ స్కూళ్ల పేరుతో విలీనం చేసే ప్రక్రియ అధికారులు వేగవంతంగా చేసుకుంటూ వెళ్తున్నారన్నారు. 60 మందికిపైగా ఉన్న స్కూళ్లను ఎంపిక చేసి, ఆ స్కూల్‌కి కి.మీ పరిధిలో ఇతర ప్రాథమిక స్కూళ్లలోని 3,4,5 తరగతులను విలీనం చేయాలని, మిగిలిన తరగతులను బేసిక్ ప్రైమరీ స్కూల్స్‌గా కొనసాగించాలని కోరారు. ప్రతి స్కూల్లో 1నుంచి 5వ తరగతి వరకు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉన్నత పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంతో పాటు, తెలుగు మీడియంను సైతం కొనసాగించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ ప్రాంతాల్లో ఉన్న స్కూళ్లను కొనసాగించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రవికుమార్, నవీన్‌పాటి, సహ అధ్యక్షుడు హేమంత్‌కుమార్, కార్యదర్శి యోహోషువా తదితరులు పాల్గొన్నారు

శివ భక్తులకు అన్నదానం

కర్నూలు కల్చరల్: స్థానిక దేవనగర్‌లోని సత్యనారాయణ స్వామి ఆలయంలో గురుస్వామి బొమ్మన రాఘవేంద్రారెడ్డి ఆధ్వర్యంలో శివమాల దీక్షాధారులకు నిత్యాన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. శనివారం పలువురు దాతలు అన్నదాన ప్రసాద వితరణలో పాల్గొన్నారు. శివపూజ, భజన అనంతరం అన్నదాన ప్రసాదాన్ని వితరణను అడిషనల్ డీఎమ్ అండ్‌హెచ్‌ఓ డాక్టర్ భాస్కర్ రాజు ప్రారంభించారు. రెడ్ల సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు దొణపాటి యల్లారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో దాతలు అక్కిమి హనుమంతరెడ్డి, సునీల్ రెడ్డి, కపిల్ సింగ్, రమేష్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.